


# గూడు - గోడు

తులసి బాలకృష్ణ

''ఛీ-బ్లడీ షిట్'' అంటూ నేలని తన్ని, కోపంతో కొంగలా అడుగులు ఎత్తెత్తివేస్తూ, చిందులేస్తున్న కుమార రత్నాన్ని న్యూసు పేపరు చాటుగా వెగటు చూపు చూసాడు శ్రీనివాసులు.

కోపాన్ని కంటిన్యూ చేసాడు వంశోద్ధారకుడు ''ఓ సెపరేట్ రూమూ లేదు పాడూ లేదు. అందుకనే ఒక్క ఫ్రెండు కూడా రాడు మనింటికి. ఇలా బజార్లోలా అందరూ ఎడాపెడా తిరుగుతూ, మాట్లాడుకుంటూ, టివిలు చూస్తూంటే చదువూ బుర్రకెక్కదు''

వెంటనే అందుకుంది సుపుత్రికా రత్నం ''సర్లె లైట్ దీస్కో, నాకు డ్రెస్ ఛేంజ్ చేసుకోడానికి సెపరేట్ రూం లేదని బిసి నుంచీ నేను గోలపెడ్తూంటే దిక్కులేదు గానీ దొరగారికి స్టడీ రూం కావాల్ట''

వెంటనే వంటింట్లోంచి కేకలు ''నోరుముయ్యండర్రా. అక్కడికి నా కోసం మీ నాన్నేదో సెపరేట్ రూం యిచ్చేసినట్లు! ఇరవై నాలుగ్గంటలూ వంటతో, చాకిరీతో ఛస్తూన్నా నాకు కాసేపు ఒంటరిగా ఏకాంతంలో మనసారా తనివితీరా ఏడ్చే అదృష్టం కూడా లేదు ఈ యింట్లో భార్యామణి చేతిలోని స్టీలు గిన్నె కొబ్బరికాయలు కొట్టే పాత్రం రాయిమీద ఖంగుమని, క్రికెట్ బాల్‌లా ఒంపులు తింటూ దొర్లుతోంది.

ముగ్గురి విసుర్ల డైరెక్షనూ తన వైపే అని తెలుసు శ్రీనివాసులికి. తెలియక పోవడమేం, తన ముప్పయి సంవత్సరాల అనుభవంతో అత్తగారు గత వినాయక చవితికి తయారు చేసి కడప బాంబుల్లాంటి ఉండ్రాళ్ళ లాంటి వాళ్ళ మాటలు సూటిగా గుండెలకి తగుల్తూంటే?

లాభం లేదిక దొంగతనం చేసయినా, బాగా విశాలమయిన త్రీ బెడ్రూం ఫ్లాట్ ఒకటి కొనిపడేయాల్సిందే! గత జన్మ శత్రువులు ముగ్గురికీ మూడు రూంలు తగలేసి, చక్కగా న్యూసెన్సు లేకుండా న్యూస్ పేపర్తో తను హాల్లో సెటిలయిపోవచ్చని కాన్ఫిడెంట్‌గా డిసైడై పోయాడు శ్రీనివాసులు. తన బడ్జెట్‌కి ఒకట్రొండు లకారాలు ఎక్కువయినా, విశాలమయిన త్రీ బెడ్రూం ఫ్లాట్ గురించి శ్రీనివాసులు చెప్పని మనిషి ఈ భూప్రపంచం మీద మిగల్లేదు. తిరగెయ్యని పేపరూ లేదు.

అతను పూర్తిగా నిరాశచెంది, నిస్పృహకి లోనై, వైరాగ్యంలోకి మారుతున్న తరుణంలో ఓ శుభముహూర్తాన ''శ్రీనివాసులూ నీ కల నిజం చెయ్యడానికి ఓ దేవుడ్ని తీసుకొచ్చాను'' అన్న కేక వినిపించి, చూస్తూన్న ఫైలులోంచి తలెత్తాడు శ్రీనివాసులు. ఎదురుగా కొలీగ్ తంగవేలు అతని ప్రక్కన చిరు మందహాసంతో మరో వ్యక్తి.

''ఈయన పేరుదా చిదంబరమప్పా. ణీ కోర్కె దీర్చి, కావళ్ళినడానికంటే వణ్ద రెడ్లు నీకు ఆనణ్దం కళిగించే గొబ్బవ్యక్తి. డైరెక్టుగా మాట్లాళుకోండప్పా మీరిద్దరూ'' అని, తన సీట్లోకి వెళ్ళిపోయాడు తంగవేలు నోట్లోంచి కిళ్ళీచొంగ కారకుండా జాగర్తపడ్తూ.

ఆనందం పెల్లుబికిన శ్రీనివాసులు చిదంబరం వైపు చెయ్యిచాపాడు. ఆ చేతిని ఆప్యాయంగా అందుకున్నాడు చిదంబరం. ఆ పైన అందంగా నవ్వాడు. ఆ నవ్వులో హేమంత తుషారం, అతని స్పర్శలో వాసంత సమీరం లాంటివి అనుభవానికొచ్చాయి శ్రీనివాసులికి. కుర్చీలో కూర్చుంటూ, లెదర్ బ్యాగ్ లోంచి తళతళ మెరిసిపోతున్న వారపత్రిక సైజు నాలుగు పేజీల అందమయిన బ్రోచర్ని తీసి, బల్ల మీద వుంచుతూ, కొంచెం గొంతు తగ్గించి, ''ఈ వెంచెర్ అలాంటిలాంటి వాళ్ళందరి కోసం కాదు సార్. హైక్లాస్ రిచ్‌లుక్‌తో డీసెంట్‌గా వుండే మధ్యతరగతి వాళ్ల కోసం మాత్రమే. గమ్మత్తేవిటంటే ఈ అపార్ట్‌మెంట్స్‌లో దిగాక మిడిల్ క్లాస్ పీపుల్‌కే హైక్లాస్ లైఫ్ గడుపుతున్న రిచ్ ఎఫెక్ట్ వచ్చేస్తుందన్నమాట'' అంటూ మునివ్రేళ్లతో బ్రోచర్ని తెరిచాడు చిదంబరం సుతారంగా.

శ్రీనివాసులు కళ్ళు చెదిరిపోయాయి.

దేవేంద్రుడి కొంప యింతకంటే అందంగా వుంటుందో...

ఆనందాన్ని అణచుకుంటూ, ''లొకేషన్ ఎక్కడ సార్?'' అనడిగాడు శ్రీనివాసులు. బ్రోచర్ని ముందుకి జరిపి 'చదవండి' అన్నట్లుగా కనురెప్పలు ఆడించాడు చిదంబరం మురిపెంగా.

శ్రీనివాసులు చూపు అక్షరాల వెంటపరుగెత్తింది.

నగరం నడిబొడ్డులో వనస్థలిపురానికి కేవలం పాతిక కిలోమీటర్ల దూరంలో చతుర్ముఖుడి ఆకారంలో ధగధగలాడే అపార్ట్‌మెంట్లు రామోజీ స్టూడియోకి, త్వరలో రాబోయే అంతర్జాతీయ విమానాశ్రయానికీ, ఆ వెన్వెంటనే రాబోయే రాకెట్ కేంద్రానికి నడిమధ్యలో అయిదు ఆక్సిజన్ సిలెండర్లు నడుంకి చుట్టుకున్నట్లు పంచప్రాణాలని నిలబెట్టే ప్రాణవాయువుని ప్రసాదించే నాలుగు దిక్కుల పచ్చదనంతో త్వరలో ఈ లొకాలిటీకే మార్చబడుతున్న ఛీఫ్, హోం మినిష్టర్ల నివాసాలకు చేరువులో కూత వేటుదూరంలో గొప్ప ఫైవ్ స్టార్ హోటల్, సకల సదుపాయాలతో, ఫారెన్ రిటర్న్డు డాక్టర్లతో కార్పొరేట్ హాస్పిటల్, అధమపక్షం పిల్లల్ని కలెక్టర్లుగానన్నా తీర్చిదిద్దే హామీతో కాన్వెంటు స్కూళ్ళు, దేశంలోనే పెద్ద పోలీసు స్టేషను, రాష్ట్రంలోనే పెద్ద కూరగాయల మార్కెట్, సమృద్ధిగా పాలు, పెరుగు దొరికే కేంద్రాలు, ఎటు చూసినా సుందర దృశ్యాలూ'

'ఓహ్' శ్రీనివాసులుకి ఊపిరి అందడం కష్టమయ్యింది.

బ్రోచర్ మీది బొమ్మల మీదకు దృష్టి సారించాడు.

'ప్రతిబింబం యథాతథంగా తలక్రిందులుగా కనిపించే అద్దాల వంటి పాలరాతి నేలలు, కనీసం రెండొందల అడుగుల వెడల్పున విశాలమయిన సిమెంట్ వీధులు, వీధులకు యిరువైపుల గుబురు గుబురుగా పొదరిళ్ళు, వాటికి విరగబూసిన పూలు, రోడ్లమీద నిగనిగలాడే పొడవాటి కార్లు, ఫుల్ త్రీపీసెస్ సూట్లలో చేతుల్లో బ్రీఫ్ కేసుల్తో ఆరున్నర అడుగుల అందగాళ్ళూ, ఫ్యాషన్ పెరేడ్ చేస్తున్నట్లున్న ముడికాళ్ల అందగత్తెలు, దూరంగా పచ్చిక బయళ్ళ వెనుకగా కొండల చాటున మేఘాలమాటున 'ఫిక్స్' అయిపోయిన అందమయిన ఉషోదయం.

బలవంతాన వూపిరి పీల్చుకున్నాడు శ్రీనివాసులు.

''కన్‌స్ట్రక్షన్ గట్టిగా వుంటుంది కదండీ?'' అనడిగాడు. ఆ మాత్రమైనా అడక్కపోతే తనకి వ్యవహార దక్షత బొత్తిగా లేదనుకుంటాడని.

చిదంబరం చూపుడు వ్రేలు చటుక్కున అతని ముక్కుమీద వాలింది. వెయిట్ టెల్లింగ్ మిషన్ లోంచి బయట కొచ్చిన టిక్కెట్‌లా అతని నాలుక సర్రమని బయటకొచ్చి పళ్ళమధ్య స్థిరపడింది. ''అమ్మమ్మా అంతా నెంబర్ ఒన్‌క్వాలిటీ మెటీరియల్ సార్. ఆంధ్రా సిమెంట్, రాజస్థానీ పాలరాయి, అస్సాం టీక్‌వుడ్, ఢిల్లీ డోర్‌బెల్స్, కలకత్తా వాటర్ పైప్స్, చెన్నై డ్రైనేజ్‌పైప్స్, కర్నాటకా డిస్టెంపరూ, కేరళ కూలీలు, గుజరాత్ మేస్త్రీలు, 'ఫ్రీ' జనరేటర్స్, 'ఫ్రీ' ట్రాన్స్‌ఫార్మర్, 'ఫ్రీ' కేబుల్ కనెక్షన్స్, 'ఫ్రీ' త్రిషిఫ్ట్ సెక్యూరిటీ''

దణ్ణం పెట్టేసాడు శ్రీనివాసులు. చిదంబరం శీలాన్ని శంకించినట్లయిందేమోనని ఇంగ్లీషులో నొచ్చుకుంటూ, క్షమాపణలు కోరాడు. ఆపైన తన బడ్జెట్ చెప్పాడు. ఇంకొక్క లకారం యిప్పించమన్నాడు చిదంబరం అది ధర్మం అన్నట్లుగా మొహం పెట్టి.

వెయిట్ టెల్లింగ్ మిషన్ లోంచి బయట కొచ్చిన టిక్కెట్‌లా అతని నాలుక సర్రమని బయట కొచ్చి పళ్ళమధ్య స్థిరపడింది. ''అమ్మమ్మా అంతా నెంబర్ ఒన్‌క్వాలిటీ మెటీరియల్ సార్. ఆంధ్రా సిమెంట్, రాజస్థానీ పాలరాయి, అస్సాం టీక్‌వుడ్, ఢిల్లీ డోర్‌బెల్స్, కలకత్తా వాటర్ పైప్స్, కేరళ కూలీలు, గుజరాత్ మేస్త్రీలు, 'ఫ్రీ' జనరేటర్స్, 'ఫ్రీ' ట్రాన్స్‌ఫార్మర్, 'ఫ్రీ' కేబుల్ కనెక్షన్స్, 'ఫ్రీ' త్రిషిఫ్ట్ సెక్యూరిటీ''

'రైటో' అన్నాడు శ్రీనివాసులు.

అడ్వాన్సుగా లక్షకు చెక్కిచ్చాడు దర్జాగా నవ్వుతూ.

ఆర్నెల్లలో లక్షణంగా గృహప్రవేశం జరుపుకోమన్నాడు చిదంబరం రెండు చేతులూ జోడించి, నమ్మకంగా, వినయంగా, మర్యాదగా.

శ్రీనివాసులికి ఇంట్లో గౌరవం బెజవాడలో టెంపరేచర్లా యమస్పీడుగా పెరిగిపోయింది.

తమకి కేటాయించబోయే సెపరేట్ రూముని ఎలా డెకరేట్ చేసుకోవాలో వాళ్ళ వాళ్ళ టేస్టుల ప్రకారం వూహించేసుకుంటూ, ఇంత మంచి పని చేస్తూన్న ఇంటి పెద్దని కుటుంబ సభ్యులందరూ తమతమ ప్రత్యేక డిజైన్డు పద్ధతుల్లో అపురూపంగా చూసేసుకుంటున్నారు.

లోన్‌కి అప్లైచేసి, చిల్లరమల్లర స్థిరాస్తులన్నీ బేరానికి పెట్టేసి, పన్లో పని ఓ సెకండ్‌హాండ్ కారు కూడా కొనెయ్యడానికి డిసైడైపోయాడు శ్రీనివాసులు. అవును మరి అంతలెవెల్ అపార్ట్‌మెంట్స్‌లో కారుండకపోవడం చిన్నతనంగా వుంటుం దని.


గుక్కతిరగని ఆనందంలో కాలచక్రం చక్కగా కారుచక్రంలా స్పీడుగా తిరుగుతోంది.

ఆఖరి ఇన్‌స్టాల్ మెంట్ 'పే' చేస్తూ, వారం రోజుల్లో గృహప్రవేశానికి ముహూర్తం పెట్టించేసి, ఫ్లాట్ ఎక్కడా దాకా రెడీ అయ్యిందో చూద్దామని వెళ్ళి చూసి, ఫ్లాట్ అయిపోయాడు శ్రీనివాసులు. ఇంకా ఫ్లోరింగ్ పూర్తికాలేదు. మెట్లుకి యిటుఅటూ పిట్టగోడలుగాని, రైలింగ్సుగానీ లేవు. లిఫ్టురాలేదు. జెనరేటర్స్ రాలేదు. ట్రాన్స్‌ఫార్మర్ రాలేదు. తనది అయిదవ అంతస్థులో ఫ్లాట్ నెంబరు ఫైవ్‌నాట్ ఫోర్. మెట్లెక్కుతూంటే చెప్పులకు ముద్దలు ముద్దలుగా సున్నం, మట్టి, సిమెంటులాంటి పదార్థం అంటుకుపోయి, అడుగుతీసి అడుగువేయడం కష్టంగా వుంది.

''ఏవిటీ పరిస్థితీ?'' అన్నట్లుగా తనవైపే బేలగా చూస్తూన్న శ్రీనివాసులుతో ''మీకెందుకు సార్ గృహప్రవేశంనాటికి మీఫ్లాటు, అసలీ బిల్డింగు ఎలా వుంటుందో మీరే చూద్దురుగానిగా'' అంటూ, చిరునవ్వుతో అభయమిచ్చాడు చిదంబరం.

గృహప్రవేశం కార్డులు అచ్చోయించి, వూళ్ళో కొదిలారు.

పురోహితుడ్నీ, వంటవాళ్ళనీ, షామియానా వాళ్ళనీ ఫిక్స్ చేసుకునేసరికి పితామహులు ప్రత్యక్షమయ్యారు. అంతదూరం రామని బెట్టుచేసి,




రెట్టింపు రేట్లు ఫిక్సుచేసుకున్నారంతా. సన్నాయి మేళం దొరకలేదు టేప్‌రికార్డర్ గతి. 'పురోహితుడి కన్వీనియన్స్' ప్రకారం తెల్లారుగట్ల ముహూర్తం కుదిరింది.

చిదంబరం అయిపూ జాడా లేదు.

తెల్లారుగట్ల కేవలం తన కుటుంబసభ్యులతో గృహప్రవేశం కావించాడు శ్రీనివాసులు. ముహూర్తం టైముకి అతిథులెవ్వరూ రాలేదు దూరానికి వెరసి.

శ్రీనివాసులు ధుమధుమలాడుతూన్నాడు ప్రతి దానికీ.

అదే సమయంలో "గృహప్రవేశానికి అసలు యింట్లో ఆవుని తిప్పాలనుకుంటా గదా నాన్నా?" అనడిగాడు పుత్రరత్నం.

"ఎద్దు తిరిగినా చాలు" అన్నాడు శ్రీనివాసులు కోపంగా కొడుకుని ఎగాదిగా చూస్తూ.

అప్పటికే తండ్రి కండిషన్‌ని అర్థంచేసుకోలేక పోయిన కొడుకు, మళ్ళీ "ఇవ్వాళ మా ఫ్రెండ్సు ఓ ముఫ్ఫైమంది దాకా భోజనాలకి వస్తారు" అన్నాడు వాళ్ళకి ఏలోటూ లేకుండా మర్యాద చేసే బాధ్యతనీది అన్నట్లుగా తండ్రికి సవాలు విసుర్తూ.

"వస్తారు నాయినా ఎందుకు రారూ?" అని మాత్రం అని ఏదో చటుక్కున గుర్తొచ్చి "అన్నట్లు, క్రింద వాటర్ డ్రమ్ముల మీద బట్టలు కప్పించారా లేదా?" అంటూ హడావుడిగానూ, జారిపడకుండా జాగర్తగానూ క్రిందకు పరుగెత్తిన శ్రీనివాసులు, అక్కడ దృశ్యాన్ని చూసి కొయ్యబారిపోయాడు.

అలగా జనం కొందరు బిందెలతో డ్రమ్ముల్లోంచి నీళ్ళు తోడుకుపోతున్నారు. కొందరయితే శ్రమ ఎందుకని పిల్లలకి అక్కడే స్నానాలు చేయించేస్తున్నారు. మరి కొందరు చెంబులతో నీళ్ళు ముంచి, దూరంగా పొదల చాటుకి వెళ్తున్నారు. బలవంతంగా, ప్రయత్నపూర్వకంగా తేరుకున్న శ్రీనివాసులు, "ఏయ్, ఏయ్ ఏవిటిది? అవి మంచినీళ్ళు! అలా వాడేస్తున్నారేవిటీ?!" అని కేకపెట్టాడు.

అభయముద్రతో, ఓ దుబ్బు మీసాల పహిల్వాను ముందు కొస్తూ "ల్లే ఒక డరమ్ము మీ కోసమే గట్లనే వుంచినం. అస్సలు ముట్టలె."

అంటూ అప్యాయంగా నవ్వాడు. వాళ్ళందర్నీ బ్రతిమలాడి, అక్కడ్నుంచి పంపించేసరికి పితృ పితామహులు పునర్దర్శన భాగ్యం కలిగింది శ్రీనివాసులికి.

మధ్యాహ్నమయ్యింది.

అతిథులొచ్చారు ఆపసోపాలు పడ్తూ. తాము పడ్డ కష్టానికి తనవంశవృక్షాన్ని కూకటివేళ్ళని కూడా వదిలిపెట్టకుండా శపించుకుంటున్నారని శ్రీనివాసులు గ్రహించకపోలేదు. ప్లాటు చూపించి, అందర్నీ "భోజనాలు చేద్దాంపదండి బాగా ఆలస్యమయ్యింది" అంటూ క్రిందకు దారితీయించిన శ్రీనివాసులు సెల్లార్‌లోకి వచ్చి అక్కడ దృగ్గోచరమవుతున్న సుందర దృశ్యాన్ని చూస్తూ నిలబడలేక, తడబడ్డాడు.

ఓ ముప్ఫై పైచిలుకు బస్తీ మనుషులు చక్కగా ప్లేట్లలో కావలసినవి వడ్డించుకుని, పిల్లా జెల్లాలతో గ్రూపులుగా కూర్చుని, కబుర్లు చెప్పుకుంటూ, అన్నాలు పులుసులు ఎక్కడ పడితే అక్కడ నేలమీద పడేస్తూ, పారబోస్తూ, భోజనాలు చేసేస్తున్నారు.

"ఇదేవిటీ?! మీరంతా ఎవరూ?" ఆక్రోశించాడు శ్రీనివాసులు.

కర్రపట్టుకు నిలబడి, క్రమశిక్షణతో బ్యాచెస్ వారీగా జనాన్ని భోజనాలకు వదులుతూన్న ఓ సంఘసేవకుడు, "ఏం ఫికర్లె అందర్కాలనోల్లే. బెయిటోల్లనొక్కల్ల రానియ్యలె. గిది పస్టుబేచి. ఇగ నాలుగు బేచిల్లేస్తె అయిపోతరు. గా తర్వాత తమర్ బువ్వదినొచ్చు" అని అభయమిస్తూ, పర్మిషనిచ్చాడు.

తలతిరిగి పోయింది శ్రీనివాసులకి.

"ఛీ" అని, కోరస్‌లో అందంగా లయబద్ధంగా అతి చిన్నస్వరంలో ఉచ్చరించిన అతిథిదేవుళ్ళు ఫస్టుటైం పోలీస్‌స్టేషన్ లో అడుగుపెట్టి బయటకొస్తూన్న అభిమానవంతుల్లా తలలొంచుకుని, గబగబా సైలెంట్‌గా బయటకు ప్రవహించారు.

చేష్టలుడిగిన శ్రీనివాసులు తేరుకునేసరికి, 'బేచీ'ల వారి భోజనాలయిపోయాయి.

రాక్షసులు పాడు చేసిన యజ్ఞ ప్రాంగణంలా వుంది సెల్లార్ ఏరియా.

యాంత్రికంగా కారు వైపు నడిచిన శ్రీనివాసులు భార్యా పిల్లలతో "పదండి హోటల్లో భోంచేద్దాం" అన్నాడు, గొంతులో ఏడుపు ధ్వనించకుండా జాగర్తపడ్తూ.

రోజురోజుకీ దేవేంద్రభవనం అపార్ట్‌మెంట్ అసలు రంగు బయటపడ్తోంది.

వానపడ్తే చంటిపిల్లాడి చెడ్డీలా చెమ్మగిల్లిపోతున్న రూఫ్.

ఒంటిపేట ఇటుకగోడలు. ఒక్కసుత్తి దెబ్బకే 'తుస్' మంటూ కొట్టిన మేకు అవతలి వైపుకు వెళ్ళిపోవడం, ఇంతమట్టి రివర్స్‌లో దూసుకొొచ్చి కంట్లో పడడం, వెంటనే గోడమీద ఐమూలగా మెరుపు షేపులో ఓ బీట దర్శన మివ్వడం క్షణాల్లో జరిగిపోతోంది.

చెప్పులేసుకోకుండా నడిస్తే అంపశయ్యా మీద క్యాట్‌వాక్ చేస్తూన్న ఎఫెక్టు.

యథాలాపంగా ముట్టుకుంటూ కాల్తూన్న చిచ్చుబుడ్డిలో వేలు పెట్టినట్లు చచ్చేట్టు షాక్ కొడ్తూన్న ఎలక్ట్రిక్ స్విచ్‌లు

కిటికీలు తీస్తే విశాలమయిన శ్మశాన దృశ్యం రోజూ హరిశ్చంద్రుడి కాటి సీను.

ఆ ప్రక్కన నీటి చెలమల్లో దున్నపోతుల్తో బాటు, అదే సైజు మనుషులు గోచీలతో స్విమ్మింగ్ దృశ్యాలు.

రాత్రుళ్ళు కరెంటు పోతే అయిదారు గంటలకు గాని రాకపోవడం, అగ్గిపెట్టె కోసం చీకట్లో అరమ్మైలన్నా ఉరికంబం ఎక్కబోతూన్న వాడిలా బిక్కు బిక్కుమంటూ గుండె చిక్కబట్టుకు వెళ్ళడం.

బిల్డింగ్ చుట్టూ ట్వంటీఫోర్ అవర్సూ ఊర పందుల పహారా.

వాచ్‌మన్ లేడు వాచ్‌డాగ్ వుంది అది శ్రీనివాసుల్ని చూసి నప్పుడు మాత్రమే భయంకరంగా మొరుగుతుంది.

అపార్ట్‌మెంట్స్‌కి దగ్గర్లో వున్న బస్తీలోని రౌడీ గాళ్ళకి తరుచు కారులో లిఫ్టుయివ్వాల్సిరావడం ఒక్కోసారి కారులో అందరికీ చోటు సరిపోకపోతే స్వంత పిల్లల్ని దింపి, ఆటోలో పంపాల్సిరావడం.

కుటుంబ సభ్యులు ఒక్కొక్కరు ఒక్కొక్క రూములో బద్ధశత్రువుల్లా మాటలు లేకుండా మౌనంగా దిగులుగా బెంగగా ఆందోళనగా గడపడం.

సిటీనుంచి పరిచయం వున్న వాళ్లొక్కళ్ళు కూడా రాకపోవడం.

వెల్లకిలా పడుకుని వున్నాడు శ్రీనివాసులు పైన రూఫ్‌కి వానకి ఏర్పడ్డ తడి 'మేప్ ఏ కంట్రీ' ఆకారంలో వుందా అని ఆలోచిస్తూ.

సడెన్‌గా సహధర్మచారిణి బిడ్డలతో సహా గుమ్మంవద్ద ప్రత్యక్ష్యమయ్యేసరికి, వాళ్ళ ఏకాంతానికి తనేం భంగం కలిగించాడోనని భయపడ్తూ, చటుక్కున లేచికూర్చున్నాడు.

భయం భయంగా అంది భార్య ''ఏవండీ మరి మనం మళ్ళీ సిటీసెంటర్‌లోకే వెళ్లిపోదామండీ'' అని

వెంటనే అందుకుంది కూతురు ''అవున్నాన్నా ఇక్కడ చాలా భయమేస్తోంది నాన్నా'' అని

క్షణం ఆలస్యం చెయ్యలేదు కొడుకు ''జైలుల్లో వున్నట్లుంది నాన్నా ఇక్కడ. అస్సలు చదువుసాగడంలేదు. ఏదో తెలియని బెంగగా వుంటోంది. వేరే వేరే రూముల్లో వుంటే పాతయింట్లో చక్కగా అందరం కనబడుతూ వుంటే సందడిగా వుండేది.''

''అవును చాలా బాగుండేది'' అన్నారు మిగిలిన యిద్దరూ.

ముగ్గురి కళ్ళల్లోకి సూటిగా చూసాడు శ్రీనివాసులు.

తమదే తప్పు అని, పశ్చాత్తాప పడుతున్నామని తెలియజేస్తున్నట్లుగా వున్నాయి వాళ్ళ చూపులు.

''మనం వదిలిపెట్టిన యిల్లింకా ఖాళీగానే వుందిట. తిరిగి ఆ యింటికే పోదామా!'' అనడిగాడు శ్రీనివాసులు బింకంగా.

ముగ్గురూ ఆనందంతో గంతులేసి, ''పోదాం'' అని అరిచి, అతనికి దగ్గరయ్యారు ''భలేబావుండేదాయిల్లు'' అన్నారు ముగ్గురూ ఒక్కసారే.

నిటారుగా నిలబడ్డాడు శ్రీనివాసులు. ఓ రాయి విసరడాన్కి డిసైడైపోయి, సెల్‌ఫోన్లో చిదంబరం నెంబరు కొట్టాడు.

''హల్లో'' అన్నాడు చిదంబరం విలాసంగా.

శ్రీనివాసులు గొంతు ఖంగుమంది ''మిస్టర్ చిదంబరం శ్రీనివాసులు హియర్. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నా బాల్యమిత్రుడు. నా క్లాస్‌మేట్. నా బెంచ్‌మేట్. నా లంచ్ మేట్. మేమిద్దరం చిన్నప్పుడు గోచీల్తో చెరువులో స్నానం చేసి, చెట్టాపట్టాలేయించుకు తీయించుకున్న ఫోటో యిప్పటికీ నా దగ్గరుంది. రేపు వుదయం వస్తే చూపిస్తా. నీకు కావాలంటే ఓ కాపీ కూడా యిస్తా. విషయమేమిటంటే రేపుదయం నువ్వొచ్చేటపుడు, అదే ఫోటో చూడ్డానికొచ్చేటప్పుడు నా డబ్బు చక్రవడ్డీతో సహా నాకు యిచ్చేసి, నీ బోడి ఫ్లాటు నువ్వు తీసేస్కో. లేదూ చంచల్‌గూడా సెంటర్ జైల్లో కావాలో, చర్లపల్లి సెంటర్ జైల్లో కావాలో తెలియజేస్తే, నీ కోసం రూము రిజర్వు చేయించే సాయం నేను చేసిపెడ్తా. రేపు ఉదయం గుర్తుంచుకో నో పోస్ట్‌పోన్‌మెంట్ ఈజ్ పెర్మిటెడ్ అండర్ ఎనీ సర్కమ్‌స్టెన్సెస్ ఎకార్డింగ్ టు మై ఛైల్డ్‌హుడ్ బోజమ్ ఫ్రెండ్ ద ఐజి ఆఫ్ పోలీస్. ప్లీజ్ నోట్ అండ్ టేక్ కేర్'' అని, ఫోన్ కట్ చేసేసి, కుటుంబ సభ్యుల వైపు చూసాడు శ్రీనివాసులు.

ఆనందంతో చుట్టుముట్టి, అతన్ని అతుక్కుపోయారు వాళ్ళు.

అతన్లో ఓ పెద్దహీరో కనిపిస్తున్నాడు వాళ్ళకి..

అందరి చుట్టూ చేతులు చుట్టాడు శ్రీనివాసులు ప్రేమగా.

★

